క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 ఏడాదికి సంబంధించి కెమిస్ట్రీ బోధించుటకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతరులకు 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండి పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగి బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈనెల 21 గురువారం సాయంత్రం 5గంటలలోపు ప్రభుత్వ డిగ్రీకళాశాల శాంతినగర్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. 22 శుక్రవారం ఉదయం 11గంటలకు ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీకళాశాల గద్వాలలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఇంటర్వ్యూకి హాజరయ్యేవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

21న సర్వసభ్య సమావేశం

అలంపూర్: ఈ నెల 21వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని ఉపాధి హామీ భవనంలో ఉదయం 11గంటలకు సమావేశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ పథకం, వ్యవసాయ శాఖ, ఆరోగ్య, పారిశుద్ధ్యం, పశు సంవర్ధక, సాగు, తాగునీటి, విద్యుత్, రెవెన్యూ, ఇంజినీరింగ్, గ్రామీణాభివృద్ధి, విద్యాశాఖ, ఐసీడీఎస్, ఐకేపీ, సాంఘిక సంక్షేమ, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం ఉంటుందని తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల శాఖ అధికారులు హాజరు కావాలని సూచించారు.

కురువ సంఘం కమిటీ ఎంపిక



అయిజ: మండల కేంద్రంలోని బీరప్ప ఆలయంలో మాదాసి, మాదారి కురువ సంఘం మండల కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా యాపదిన్నె రంగన్న, అధ్యక్షుడిగా పులికల్ గోవర్ధన్, ఉపాధ్యక్షులుగా తాండ్రపాడు మల్లికార్జున్, రాజాపురం బజారి, భూంపురం రమేష్, అయిజ సురేష్, ఎక్లాస్‌పురం పెద్ద ఉత్తనూరయ్య ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా టీటీదొడ్డి వీరేష్, కోశాధికారిగా తూంకుంట కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా ఉత్తనూరు పరమేష్, తూంకుంట కేశన్న, అయిజ రాముడు, మేడికొండ రామచంద్ర, తాండ్రపాడు రంగన్న ఎంపికయ్యారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు సంకాపురం రాముడు, దేవర జయన్న, కృష్ణ, వెంట్రాములు, శివకుమార్, పల్లయ్య పాల్గొన్నారు.

మొక్కలను పెంచుకుందాం



కేటీదొడ్డి: మండలంలోని పాగుంట గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను సోమవారం ఏపీఓ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు వెంబడి నాటిన మొక్కలను ఎప్పటికప్పుడు సంరక్షించాలని, వననర్సరీలలో మొక్కలను నాణ్యవంతంగా పెంచుకుందామని కోరారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకం



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్య క్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి మొక్కులను తీర్చుకున్నారు.

కస్తూర్బా విద్యార్థులకు ప్రాక్టికల్స్

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం డాక్టర్ రిజ్వానా తాన్విర్ ఆధ్వర్యంలో మండలంలోని కస్తూర్బా పాఠశాలలో చదివే ఇంటర్ ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థులు 30 మందికి 15 రోజులు డీఎమ్‌హెచ్‌డబ్ల్యూ ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం కస్తూర్బా పాఠశాల నర్సింగ్ లెక్చరర్ వెంకటేశ్వరి ఆధ్వర్యంలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.



గద్వాలలో అధ్వానంగా రోడ్లు

- కనీస మరమ్మతుకు నోచుకోని వైనం
- వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు
- అయినా పట్టించుకోని అధికారులు



జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్ సమీపంలో గుంతలమయంగా మారిన రోడ్డు

గద్వాల అర్బన్: గద్వాల పట్టణంలోని ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం రోడ్ల మరమ్మతు చేపట్టకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గుంతలమయం..

ప్రతిరోజు వివిధ ప్రాంతాల పనుల నిమిత్తం ప్రజలు జిల్లా కేంద్రానికి వస్తుంటారు. పట్టణంలోని రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా క్రిష్ణవేణి చౌరస్తా, పాతహౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని పీజేపీ కాల్వ వద్ద, 2వ రైల్వే గేటు, అంబేద్కర్ చౌరస్తా, గద్వాల–అయిజ రోడ్డు తదితర ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. చేపలమార్కెట్ సమీపంలోని రోడ్డు ఏకంగా గుంతమయంతో ఛిద్రమైంది. ఈ గుంతల్లో నీరు వచ్చి చేరడంతో మరింత దారుణంగా తయారైంది. రాత్రి సమయాల్లో ఈ రహదారులు గుండా వెళ్లాలంటే ఏ గుంత ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్ల వెంట ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయిలోని ఉన్నతాధికారులు ప్రయాణిస్తున్నా.. చూసిచూడనట్లు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే మరీ కాలనీల్లో, గ్రామాల్లో పరిస్థితి ఏమేర ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

మరమ్మతుకు నోచుకోని వైనం..

ప్రధాన రోడ్లలో ప్రయాణం సాగించాలంటే ప్రజలు, వాహనదారులకు ముప్పు తిప్పలు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలోని రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా... ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు సైతం కన్నెత్తి చూడడం లేదు. క్షేత్రస్థాయిలో పాలకులు, అధికారులు చెప్తున్న మాటలకు పొంతన లేకుండా పోయింది. కనీసం గుంతలను పూడ్చడానికి చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయంపై అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా త్వరలో మరమ్మతులు చేపడుతాం.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామంటూ చేతులెత్తేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

> **చర్యలు తీసుకుంటాం..**
> జిల్లా కేంద్రంలో రోడ్లు అక్కడక్కడ గుంతలు పడిన వాటిని ప్రతిపాదనలు పంపించాం. అతి త్వరలోనే గుంతలు మారిన రోడ్లకు మరమ్మతులు చేపడుతాం.
> – రాజేశ్వరి, ఏఈ, ఆర్‌అండ్‌బీ

శనగపల్లిలో భగవద్గీతపై అవగాహన



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని శనగపల్లిలో త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి ఎర్రవల్లి కమిటీ సభ్యులు గ్రామంలోని ఇటింటికి తిరిగి భగవద్గీతలో ఉండే జ్ఞానంపై ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సభ్యసమాజంలో ఇతరుల పట్ల మంచితో మెలిగి వారిపట్ల మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి సభ్యులు బీచుపల్లి, వెంకటేష్, పరశురాముడు, భాస్కర్‌రెడ్డి, పావని, భాగ్యమ్మ, జయలక్ష్మి ఉన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నరసింహారెడ్డి

అయిజ: క్రీడాకారులు ప్రతినిత్యం సాధన చేయాలని, క్రీడాపోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీఆర్‌ఎస్ నాయకుడు నరసింహారెడ్డి అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఎస్సీ కాలనీ సమీపంలోని తుమ్మలగుంత స్టేడియంలో చల్లా వెంకట్రామిరెడ్డి యూత్ కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ ఓపెన్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం యువకులు క్రిస్మస్ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని అభినంధించారు. మెదటి బహుమతి దాత అలంపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే విజేయుడు రూ.30,016, ద్వితీయ బహుమతి దాత రాణి రామ్ దయాల్ రూ.20,016 అందజేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు తమవసంతు ప్రోత్సాహం అందజేస్తామన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు రాములు, బీఆర్‌ఎస్ నాయకులు దేవరాజు, ఎలియాజర్, నిర్వాహకులు వెంకటేష్, నంద్, అఖిల్, క్రాడాకారులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు



రాజోళిలో సుబ్రమణ్య స్వామి విగ్రహాలకు పాలు పోస్తున్న మహిళలు

రాజోళి: సుబ్రమణ్య స్వామి పుట్టిన రోజు సుబ్రమణ్య షష్టి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని అడివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన సుబ్రమణ్య స్వాముల విగ్రహాలకు ఈసందర్భంగా అర్చకులు అడివిస్వామి ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణల మధ్య నాగప్పలకు పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు. నాగదోషాలు, సర్పదోషాలు ఉన్నవారు, సంతానం లేని వారు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించి సుబ్రమణ్య స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు.

వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో సుబ్రమణ్య షష్టి పర్వదినాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో నాగ ప్రతిమలకు పాలు పోసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సంతానం లేనివారు సంతానం కలగాలని, నాగదోషాలున్న భక్తులు దోషాలు తొలగాలని కోరుకుంటూ పూజలు చేశారు.

వీరభద్రస్వామి అలంకరణ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని వీరభద్ర స్వామికి నాగపడగల అలంకరణలో ముస్తాబు చేశారు. స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా పురవీధులలో మేలతాళాలతో ఊరేగించారు. అర్చకులు శాంతయ్య, గౌరిశంకరయ్య, మలేష్, ఆలయ ట్రస్ట్ పాల్గొన్నారు.



ఉండవెల్లిలో నాగపడగలతో అలంకరించిన వీరభద్ర స్వామి

మాచర్లలో శివస్వాముల అన్నదానం



గట్టు: మండలంలోని మాచర్లలో సోమవారం శివస్వాములు గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా శివస్వాములు గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఏర్పాటు చేశారు. 41 రోజుల పాటు చెన్నకేశవ స్వామి, రామలింగేశ్వరస్వాముల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు శివస్వాములు తెలిపారు. కార్తీకమాసం సందర్భంగా గ్రామంలోని భక్తుల దగ్గర నుంచి ధాన్యాన్ని సేకరించి, గ్రామస్తులకు దేవాలయం దగ్గర అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని శివాలయంలో శివునికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్న సమయంలో అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాత్రి సమయంలో శివాలయంలో నందికోల శావ నిర్వహించారు.

ఆరోగ్యవంతమైన మొక్కలు పెంచాలి



నర్సరీ మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సాయి ప్రకాష్

అయిజ: నర్సరీల్లో ఆరోగ్యవంతమైన మొక్కలను పెంచాలని ఎంపీడీఓ సాయిప్రకాష్ అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పలలో మొక్కలను పెంచుతున్న నర్సరీని పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని, సారవంతమైన మట్టిని ప్లాస్టిక్ సంచులలో నింపి అవసరమైన మేరకు నీరు పోస్తూ మొక్కలను పెంచాలని అన్నారు. అనారోగ్యకరంగా కనిపించే మొక్కలను నర్సరీ నుంచి వేరు చేసి పక్కన పెట్టాలన్నారు. భూమిలో నాటేందుకు కావల్సినంత దృడంగా మొక్కలను పెంచాలని నర్సరీ నిర్వాహకుడికి సూచనలు చేశారు. ఎంపీడీఓ వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి తులసీ కుమార్ ఉన్నారు.

సాఫీగా సాగిన మండల సభ



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎండీ జబ్బార్

ధరూరు: ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సోమవారం ఉదయం 11గంటలకు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కాగా, సభ్యులు మండల సమస్యలను లేవనెత్తకపోవడంతో సభ సాఫీగా కానిచ్చారు. మండల ఎంపీపీ నజీమున్నీసాబేగం అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎన్నడూలేని విధంగా మండల సింగిల్ విండో చైర్మన్ మహదేవమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ సురేష్, వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలత, అనంతరం వరుసగా ఉపాధి, హెల్త్, రెవెన్యూ ఇతరశాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎంపీడీఓ ఎండీ జబ్బార్ మాట్లాడారు. గ్రామాల్లో వైద్యశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఎంపీఓ కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలి



అమరవాయి నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

మల్దకల్: హరితహారం నాటికి నర్సరీలలో మొక్కలను పెంచి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య నర్సరీ నిర్వహకులకు సూచించారు. సోమవారం మండలంలోని బిజ్వారం, అమరవాయి, పెద్దపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. మొక్కల చుట్టూ గడ్డిమొక్కలను తొలగించి ట్రీ గార్డులు లేని మొక్కలకు ఏర్పాటు చేయాలని, హరితహారం నాటికి నర్సరీలలో మొక్కలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ స్వామి, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

అయిజ: మండల కేంద్రంలోని బీజీఆర్ పాఠశాల విద్యార్థి పవన్‌కుమార్ ఉమ్మడి జిల్లా నుంచి 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెండరేషన్ ఖోఖో విభాగంలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో సోమవారం పాఠశాల యాజమాన్యం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బీజీఆర్ పాఠశాల కరస్పాండెంట్ బాల వెంకటరెడ్డి మాట్లాడారు. ఈనెల 20 నుంచి 22 వరకు అసిఫాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్–14, బాలుర విభాగంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి తమ పాఠశాల విద్యార్థి పాల్గొని గద్వాల జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షించతగ్గ విషయమన్నారు. పాఠశాల పీఈటీ సూర్యచంద్ర, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు.. శుభ్రత కనుమరుగు



తుర్కోనిపల్లి గ్రామంలో రోడ్లపై మురుగునీరు

గద్వాల మండలంలో తుర్కోనిపల్లి, ముల్కల్‌పల్లి గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. అపరిశుభ్రతతో దుర్వాసన వెదజల్లుతూ చిత్తడి చిత్తడిగా మారింది. దీంతో రోడ్ల గుండా తిరిగేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛ్ భారత్, స్వచ్ఛ్ గ్రామంపై విస్తృతంగా ప్రచారం చేసే నాయకులు, అధికారులు గ్రామాల్లోని పారిశుద్ధ్యం సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– గద్వాల అర్బన్



ముల్కల్‌పల్లి గ్రామంలో రోడ్డుపై మురుగు ఇలా.

కుక్కలతో బెంబేలు..



గద్వాల పట్టణంలో కుక్కల గుంపు

- గుంపులు గుంపులు తిరుగుతున్న వైనం
- రోడ్లపైకి రావాలంటే జంకుతున్న ప్రజలు
- ఇప్పటికే పలువురికి కుక్కకాటు
- పట్టించుకోని అధికారులు

గద్వాల అర్బన్: గద్వాల మండలంలో ఎటు చూసినా కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. దీంతో ఆయా గ్రామాల వాసులు, పట్టణ ప్రజలు రోడ్లపై తిరగాలంటే భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో, పట్టణంలో కాలనీల్లో, గల్లీలో పదుల సంఖ్యలో కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా అవి తిరగడంతో ఇంటి నుంచి రోడ్డు మీదకు రావాలంటే జంకుతున్నారు. నిత్యం ఏదో ఒక చోట ఎవరో ఒకరు కుక్కకాటు బారిన పడుతున్నారు. చిన్నా పెద్ద అని తేడా లేకుండా దాడి చేస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటే వెంబడించి మరీ కారుస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. కుక్కల నియంత్రణకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వాటి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంపులు గుంపులుగా..

గద్వాల పట్టణంలో కాలనీల్లో, మండలంలోని గోన్‌పాడు, కొండపల్లి, చెనుగోనిపల్లి, అనంతపురం, నదిఅగ్రహారం తదితర గ్రామాల్లో కుక్కలు గుంపులు గుంపులు సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పనుల కోసం బయటకు వచ్చే వారిపై, ఆడుకునే పిల్లలపైన కుక్కలు దాడి చేస్తుండడంతో అస్పత్రిపాలు కావల్సివస్తోంది. కాలనీల్లో ప్రజలు వ్యర్థాలు పడేస్తున్న చోటకు కుక్కలు చేరి వాటిని తింటూ రోడ్లపై వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. ఆడుకుంటున్న పిల్లలను సైతం ఆకస్మాత్తుగా దాడి చేసి, గాయపర్చుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు పిల్లలను బయటకు ఒంటరిగా పంపలేకపోతున్నారు. అయిదు నెలల క్రితం కొండపల్లిలో ఇద్దరు చిన్నారులు ఆడుకుంటుండగా.. వారి దాడి చేసి గాయపర్చాయి. నదిఅగ్రహారానికి చెందిన పలువురు వ్యక్తులు పని నిమిత్తం గద్వాలకు వచ్చి తిరిగి వెళ్తుండగా, పట్టణంలోని పాతహౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. రెండు నెలల క్రితం గోన్‌పాడులో ఆరుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గత నెల అనంతపురంలో బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. ఈనెల 12న పట్టణంలోని ఒంటెలపేట కాలనీలో ఐదుగురు చిన్నారులు కలిసి ఆడుకుంటుండగా.. రెండేళ్ల బాలుడిపై దాడి చేసి తల భాగంలో తీవ్రంగా పర్చాయి. ఇలా నిత్యం మండలంలో ఏదో ఒక చోట కుక్కలు చిన్నారులు, పెద్దలపై దాడి చేస్తున్న సంఘటనలు నిత్యకృత్యంగా మారాయి. ఈ సంఘటనలు వెలుగులోకి వస్తున్నా అధికారులు మాత్రం వాటి నివారణ చర్యలు తీసుకోవడం లేదు. గద్వాల మున్సిపల్ పరిధిలో ఆయా కాలనీలో అడపాదడపా కుక్కలను బందించి తరలించారు. ఇక గ్రామ పంచాయతీల్లో కుక్కలను అరికట్టేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

> **నియంత్రణకు చర్యలు తీసుకోవాలి**
> 
> పట్టణంలో కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో బయటకు రావాలంటే భయపడుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి.
> – ఖాజాహుస్సేన్, గద్వాల

> **దాడచేస్తున్నాయి..**
> 
> వీధి కుక్కలతో తరచు ఇబ్బందులు పడుతున్నాం. చిన్నారులు, పెద్దలు బయటకు రావాలంటే జంకుతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ కరుస్తున్నాయి. ఇటీవల నా రెండేళ్ల బాబు ఉజేఫ్ ఆడుకుంటుండగా, దాడి చేసి తలభాగంలో తీవ్రంగా గాయపర్చాయి. కుక్కలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.
> – ముజీబ్, ఒంటెలపేట, గద్వాల

నిబంధనల మేరకు ఎరువుల విక్రయాలు

అలంపూర్: ప్రభుత్వ నిబంధనల మేరకు రసాయన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని ఏడీఏ సక్రియా నాయక్ అన్నారు. అలంపూర్ మండలంలోని బుక్కాపురం రైతువేదికలో మండలంలోని రసాయన ఎరువులు, విత్తన డీలర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడీఏ మాట్లాడుతూ రసాయన ఎరువుల చట్టం, విత్తన చట్టం, పురుగుమందుల చట్టాన్ని అనుసరించి డీలర్లు క్రయవిక్రయాలు చేయాలన్నారు. రైతులకు ఎరువులను ఎమ్మార్పీ ధరలకే ఇవ్వాలన్నారు. నిబంధనలు అతిక్రమించి క్రయవిక్రయాలు చేస్తే డీలర్లపై చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్ పొందిన డీలర్లు విత్తనాలు ఎరువులు, పురుగు మందులను విక్రయించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సీహెచ్ అనిత, ఏఈఓ సాయిరాం, వివిధ గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సక్రియా నాయక్

ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మారుద్దాం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదామని శాంతినగర్ సేవాసమితి వడ్డేపల్లి సభ్యులు ప్రజలకు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌ను అంతం చేయడానికి సేవాసమితి సభ్యులు సొంత ఖర్చులతో 2023 జనవరి 1న వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్, ప్రభుత్వ పాఠశాలల్లో బట్ట సంచులు పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈఏడాది 2024 జనవరి 1న మున్సిపాలిటీలో బట్ట సంచుల పంపిణీ కార్యక్రమం చేపట్టేందుకు ప్రణాళికలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మానవతావాదులు, పర్యావరణ ప్రేమికులు, దాతలు గొప్ప హృదయంతో ముందుకొచ్చి వారికి తోచిన మేరకు బట్టసంచులు కుట్టించి పంపిణీ చేయాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు కనువిప్పు కలిగేందుకు సేవాసమితి కృషిచేస్తోందని, దాతలు సహృదయంతో ముందుకొచ్చి చేయూత అందించాలని సేవాసమితి సభ్యులు కోరారు.